క్లుప్తంగా

రేషన్ డీలర్లు తరలిరావాలి

మెట్‌పల్లిరూరల్: హైదరాబాద్‌లో ఈనెల 24న సభకు రేషన్ డీలర్లు తరలిరావాలని సంఘం మండలాధ్యక్షుడు తెలు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మ్యాడపు లావణ్య ఆదివారం కోరారు. ప్రతి డీలర్‌కు రూ.5వేల గౌరవ వేతనంతోపాటు క్వింటాల్‌కు రూ.300 కమీషన్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సభ ఏర్పాటు చేశారని, విజయవంతం చేయాలని కోరారు.

నేడు మోడల్ స్కూల్లో ఇంటర్వ్యూ

పెగడపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో గంటల ప్రాతిపదికన కెమిస్ట్రీ(పీజీటీ), ఇంగ్లిష్(పీజీటీ) సబ్జెక్టులు బోధించేందుకు అర్హత గల అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు ఎమ్మెస్సీ, కెమిస్ట్రీ, బీఎడ్, పీజీటీ ఆంగ్లం పోస్టుకు ఎంఏ, ఇంగ్లిష్, బీఎడ్ చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో సోమవారం లేదా మంగళవారం మోడల్ స్కూల్లో నిర్వహించే డెమో క్లాసులకు హాజరు కావాలని సూచించారు.

నేడు డెమో క్లాసులు

కథలాపూర్: కథలాపూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి సోమవారం ఉదయం డెమో క్లాసులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. 8 టీచర్ పోస్టులకు గాను 150 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్‌లో నిర్వహించే డెమో క్లాసులకు హాజరు కావాలని సూచించారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న మిత్రులు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న పోగుల సంఘవి భర్త మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. వారి కుటుంబానికి ఆదివారం పదోతరగతి 1998–99 మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్, పల్లికొండ అశోక్, కొత్తపెల్లి రాజకుమార్, పురాణపు రామానుజం తదితరులు పాల్గొన్నారు.

యువకుల చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న యువకులు

జగిత్యాలరూరల్: బాలెపల్లి గ్రామానికి చెందిన ఏగుర్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆమె ఇద్దరు కుమారులు ఏగుర్ల మల్లికార్జున్, కుమార్‌కు యువకులు గ్రామస్తుల సహకారంతో ఆదివారం రూ.30,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

భార్యపై భర్త ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: తన భార్య మరో వ్యక్తితో కలిసి కుమారుడికి పాయిజన్ ఇచ్చారని జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రతాప్ అనే వ్యక్తి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. కుమారుడు ప్రభాస్‌కు తన భార్య, మరొకరు కలిసి పాయిజన్ ఇచ్చారని, దీంతో అనారోగ్యానికి గురయ్యాడని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని, మెజిస్ట్రేట్ బాలుడి స్టేట్‌మెంట్ రికార్డు చేశారని అన్నారు. దాని ఆధారంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

కలప పట్టివేత



అటవీ శాఖ అధికారులు పట్టుకున్న టేకు దుంగలు

జగిత్యాల రూరల్: పొరండ్ల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఎనిమిది కలప దుంగలను, ఒక యంత్రాన్ని అల్లీపూర్ అటవీ శాఖ సెక్షన్ అధికారి దుర్గం సాంబయ్య, ఈస్ట్ అధికారి అరిఫ్ పట్టుకొని కల్లెడకు తరలించారు. విచారణ చేసి కలప నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లోలెవల్ వంతెనతో నిలుస్తున్న రాకపోకలు

- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



చిన్నపాటి వర్షానికి రాయికల్–ఇటిక్యాల మధ్యనున్న లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న నీరు

రాయికల్: పట్టణంలో చిన్నపాటి వర్షానికే లోలెవల్ వంతెనపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. పట్టణ శివారులో ఉన్న లోలెవల్ వంతెనపై నీరు ప్రవహించడంతో నిర్మల్ జిల్లా నుంచి రాయికల్ మండలం సింగరావుపేట, ఇటిక్యాల లోలెవల్ వంతెనతో జగిత్యాల జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. రామాజీపేట–భూపతిపూర్, మూటపల్లి–కొత్తపేట, ఇటిక్యాల–మూటపల్లి, వస్తాపూర్–ఒడ్డెలింగాపూర్, మైతాపూర్–అయోధ్య, మైతాపూర్–బస్టాండ్ ఏరియాల్లో ఉన్న లోలెవల్ వంతెనలతో వర్షాకాలంలో నీరు ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ వంతెనలపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు అంచనాలు వేసినా కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ముఖ్యంగా సింగరావుపేట, ఇటిక్యాల కల్వర్టులపై అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే రాకపోకలు బంద్



రాయికల్ మండలం మూటపల్లి గ్రామంలో ఉన్న లోలెవల్ వంతెనపై చిన్నపాటి వర్షానికి సైతం నీరు ప్రవహించడంతో మా గ్రామం నుంచి ఇతర గ్రామానికి వెళ్లాలంటే రాకపోకలు నిలిచిపోతాయి.

– బెక్కం తిరుపతి, మాజీ సర్పంచ్

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించాలి



రాయికల్ నుంచి ఇటిక్యాలకు వెళ్లే దారిలో ఉన్న లోలెవల్ వంతెన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేలా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చొరవ తీసుకోవాలి. వర్షం కురిస్తే నిర్మల్ జిల్లాకు రాకపోకలు నిలిచిపోతాయి.

– వాసం స్వామి, రాయికల్

పోచమ్మ తల్లి ఆలయంలో అన్నదానం



అమ్మవారి సన్నిధిలో జ్యోతి, శ్రావణి

జగిత్యాలటౌన్: శ్రీలోకమాత పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మాతలు అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యాన్ని ఆదివారం అమ్మవారి ప్రసాదంగా అన్నదానం చేశారు. బల్దియా చైర్మన్ అడువాల జ్యోతి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ డా.భోగ శ్రావణి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం స్వీకరించారు. నవరాత్రుల కరపత్రాలు ఆవిష్కరించారు. ఆలయ అధ్యక్షుడు గాజుల రాజేందర్, వార్డ్ కౌన్సిలర్ ములస్థం లలిత, ఆలయ పాలకవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎస్సారెస్పీ వంతెన



పెగడపల్లి: నందగిరి–పెగడపల్లి రహదారిపై ఉన్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ వంతెనపై ఇసుక మేటతో పాటు తరచూ కురుస్తున్న వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెనకు రెండు వైపులా తారు వేసి వంతెనను వదిలేశారు. ఓవైపు వంతెనపై ఇసుక మేట, మరోవైపు మోకాలి లోతు వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వంతెనపై వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. వంతెనను మరమ్మతు చేయించి నీరు నిల్వకుండా చూడాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు చరిత్రలో నిలిచిపోవాలి



మాట్లాడుతున్న జిల్లా గవర్నర్

ధర్మపురి: ప్రజా సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సేవలు చరిత్రలో మిగిలిపోయేలా ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావ్ అన్నారు. పట్టణంలో ఆదివారం ధర్మపురి లయన్స్ క్లబ్ 320జీ స్పెషల్ బోర్డ్ ఆఫ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ దంపతులను లయన్స్ క్లబ్ పక్షాన ఆహ్వానించారు. ముందుగా ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో 2024–25లో ధర్మపురి లయన్స్ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాల నివేదికను సమర్పించారు. జిల్లా గవర్నర్ మాట్లాడుతూ.. సమాజ సేవ అనేది గొప్ప వరమని, సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అన్నారు. సేవా కార్యక్రమాల్లో ధర్మపురి లయన్స్ క్లబ్ పతాక స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మానవ సేవయే మాధవ సేవని భావించుకొని ముందుకు సాగాలని సూచించారు. నిరుపేదలకు దుప్పట్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ, అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, కార్యదర్శి స్తంభంకాడి రమేశ్, రాజేందర్, ఆనంద్, వినోద్‌రావ్ తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వం తీసుకున్నవారితో నాయకులు

మెట్‌పల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని వెంకట్రావ్‌పేటలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణతోపాటు సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమవుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పెద్ద సంఖ్యలో ప్రజలు పార్టీ సభ్యత్వం తీసుకొని అండగా నిలవాలని కోరారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్, గోపనవేని రమేశ్, దండక నర్సయ్య, బెల్లాల రాజేశ్వర్, జక్కుల నగేశ్ తదితరులున్నారు.

అంబేడ్కర్‌ను అవమానించినవారిని శిక్షించాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కోరుట్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానించినవారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ ఎమ్మెల్యే అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి ధ్వంసం చేసి అవమానపరచటం సరికాదన్నారు. ఆ ఎమ్మెల్యేను వెంటనే తొలగించాలని, టీడీపీ నుంచి కూడా సస్పెండ్ చేయాలని టీడీపీ అధినేత, ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. ఎమ్మెల్యేకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోరుట్ల డివిజన్ ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, నాయకులు ఉయ్యాల నర్సయ్య, బలిజ రాజరెడ్డి, పసుల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు గణేశ్‌నగర్2లోని పలు ఇళ్లకు మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీలు, దీపాల్లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా అధికారులు అటువైపు చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం చేసుకొని 8 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా కనీస వసతులు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



కథలాపూర్: ఇప్పపెల్లి గ్రామ శివారులో రూ.10లక్షలతో నిర్మించిన వైకుంఠధామానికి దారి లేక మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైకుంఠ ధామం రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైందని, మరమ్మతు గురించి పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
శంకర్, ఎంపీడీవో, కథలాపూర్, సెల్ నంబర్: 9281481652

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

సంఘాలు-కార్యవర్గాలు

కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మల్యాల: తాటిపల్లి గ్రామంలోని రెడ్డి సంఘ సభ్యులు ఆదివారం ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదర్శ రైతు రెడ్డి సంఘం అధ్యక్షుడిగా తూకుంట్ల నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా తూకుంట్ల లింగారెడ్డి, కోశాధికారిగా దొంగ లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సూర జనార్దన్‌రెడ్డి, సభ్యులుగా నర్ర తిరుపతిరెడ్డి, అట్ట నగేశ్(రాజు), సూర రాజేందర్, సూర సాయిరెడ్డి, రాజేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి అభినందించారు.

ఆర్యవైశ్య మహాసభ యువజన జిల్లా ఉపాధ్యక్షుడిగా రాకేశ్‌గుప్తా



మల్లాపూర్: ఆర్యవైశ్య మహాసభ యువజన జిల్లా ఉపాధ్యక్షుడిగా మేడి రాకేశ్ గుప్తాని నియామకం చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి తెలిపారు. రాకేశ్‌కు ఆదివారం ఆయన నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య మహాసభ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పాటునందించాలని సూచించారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. లింబాద్రి, సభ్యులకు రాకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎలక్ట్రిషన్, ప్లంబర్స్..



ధర్మపురి మండల ఎలక్ట్రిషన్, ప్లంబర్స్ నూతన కార్యవర్గం

ధర్మపురి: పట్టణంలో ఆదివారం మండల ఎలక్ట్రిషన్, ప్లంబర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలంలోని 8 గ్రామాలకు చెందిన ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబర్స్ లైండర్స్ సుమారు వంద మంది సభ్యులతో శ్రీలక్ష్మీనరసింహ ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబర్స్ కార్మిక సంఘం పేరును నమోదు చేసుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎదులాపురం సత్యానారాయణ, అధ్యక్షుడిగా గడిపెల్లి రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా పుల్లూరి శ్రీకాంత్, తుమ్మనపెల్లి లక్ష్మణ్, ఎనగందుల అనిల్, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ నరేశ్ తదితరులను ఎన్నుకున్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధంగా ఏర్పాటు చేశామని తెలిపారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

సారంగాపూర్: కోనాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బెజ్జంకి సిద్ధార్థ్ జిల్లాస్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా.. సిద్ధార్థ్‌ను ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. కోనాపూర్ ఉన్నత పాఠశాల నుంచి ఈనెల 25 నుంచి 28 వరకు జిల్లాస్థాయి పోటీల్లో సిద్ధార్థ్ ప్రతిభ కనబరచాలని నాయకులు ఆకాంక్షించారు. సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి సన్నిధి ఆదివారం భక్తుల సందడి కనిపించింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	12	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	01	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	03	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	13	560
నందీశ్వర సూట్స్	01	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	10	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	0	336

– వేములవాడ

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపండి



బీర్‌పూర్ ఘాట్ ఎక్కే సమయంలో బస్సు నుంచి దిగిన ప్రయాణికులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మీదుగా కడెం, జన్నారం వెళ్లే బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు మొదటి నుంచి మొర పెట్టుకుంటున్నా.. ప్రయాణికులకనుగుణంగా బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఆదివారం బీర్‌పూర్ ఘాట్ ఎక్కే సమయంలో బస్సు నుంచి ప్రయాణికులను దింపారు. బీర్‌పూర్ మండలంలో మొత్తం 15 గ్రామాలున్నాయి. వీటితోపాటు జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి బీర్‌పూర్ మీదుగా మంచిర్యాల జిల్లా కడెం, జన్నారంకు ఇదే రోడ్డు గుండా బస్సులు నడుస్తుంటాయి. ప్రస్తుతం ఉన్న 4 ట్రిప్పుల బస్సులు ఎప్పుడు రద్దీగా ఉంటున్నాయి. జగిత్యాల వైపు వెళ్లే సమయంలో, జగిత్యాల నుంచి తిరిగి బీర్‌పూర్ మండలం వైపు బస్సులు వచ్చే సమయంలో బీర్‌పూర్ ఘాట్ మీది నుంచి బస్సుల రాకపోకలు సాగుతాయి. బీర్‌పూర్ ఘాట్ ఎక్కే సమయంలో బస్సుల్లో ప్రయాణికులు పరిమితికి మించి ఉండడంతో.. డ్రైవర్లు ప్రయాణికులను బస్సు నుంచి తప్పనిసరిగా దించాల్సి వస్తోంది. కొన్నిసార్లు బస్సులో ఉన్న ప్రయాణికులు దిగి బస్సును ఘాట్ ఎక్కుతున్న సమయంలో నెడుతున్నారు. ప్రస్తుతం ఉన్న నాలుగు ట్రిప్పులకు అదనంగా మరో నాలుగు ట్రిప్పులు పెంచాలని బీర్‌పూర్, జన్నారం, కడెం ప్రజలు కోరుతున్నారు.